క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

మరికల్: ఇటుక బట్టీల వద్దకు భారీ వాహనాలు తిరగడంతో పూర్తిగా ధ్వంసమైన కన్మనూర్ రోడ్డును అధికారులు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు నర్సింహులు, శ్రీనివాస్, వెంకటయ్య అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిరంతరంగా ఇటుక బట్టీలకు అధికలోడుతో టిప్పర్లు, లారీలు వెళ్లడంతో రోడ్డు గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

నర్వ: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం నుంచి డిసెంబర్ 1 ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పోలీంగ్ కేంద్రాల చుట్టు పక్కల 200 మీటర్ల వరకు 30న రాత్రి 8 గంటలవరకు సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్పీకి వినతి



మక్తల్: కాంగ్రెస్ అభ్యర్థిపై ఫేక్ వీడియోలు తయారుచేసి లేనిపోని విషయాలను సోషల్ మీడియాల్లో వైరల్ చేస్తున్నారని ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, కావలి శ్రీహరి, రవికుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

నేడు సాయినాథుడికి ప్రత్యేకపూజలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సాయినగర్ సకల దేవతల ఆలయంలో గురువారం సాయినాథుడికి ప్రత్యేకపూజలు చేయనున్నారు. ఉదయం సాయివ్రతం, పల్లకీసేవ, మధ్యాహ్నం మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పాలాది రమేష్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యంలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండల కేంద్రానికి చెందిన సొప్పరి మశమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖరీం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, చామంతి రాజులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పుట్ట రాము, పాండేళ్ల సురేష్, శరత్ బాబు, రామకృష్ణ, బాబు, గుండి తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లతో కూరగాయల సాగు



పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల రైతులు పాలిథిన్ కవర్ల కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని సాతాపూర్, చెన్నపురావుపల్లి, చిన్నకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగు చేపట్టారు. పాలిథిన్ కవర్‌లను ఏర్పాటు చేసుకొని మధ్యమధ్యలో రంధ్రాలు ఏర్పాటు చేసి డ్రిప్ సౌకర్యం ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. నీటి తేమశాతం ఆరిపోకుండ పాలిథిన్ కవర్ ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. కలుపు మొక్కలు కూడ పెరగకపోవడంతో కూరగాయల దిగుబడి పెరుగుతుందని రైతులు వివరించారు. ఒక ఎకరాకు పాలిథిన్ కవర్లు రూ.4 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

దాడి హేయమైన చర్య

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు బొమ్ము ఆంజనేయులుపై మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం దాడి చేయడాన్ని ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఖండించారు. బుధవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి బాధితుడు ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ అకారణంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేశాడని బాధితుడి ఆరోపించారు.

వరిగడ్డిలో మెండుగా పోషకాలు

- పంటల వ్యర్థాలను కాల్చొద్దు
- పశుగ్రాసంగా వినియోగించుకుంటే ఉత్తమం



వరి గడ్డి తీసుకువెళ్తున్న రైతులు (ఫైల్)

మాగనూర్: వానాకాలం వేసుకున్న వరిపంట దిగుబడి వచ్చింది. వరికోతల అనంతరం గడ్డిని పాడి పశువుల పోషణకు గ్రాసంగా ఏడాది వరకు నిల్వ చేసుకునే వీలుంది. పాడిపశువులకు సాధారణంగా వరిగడ్డిని పశుగ్రాసంగా అందించడం మనకు తెలిసిందే. కొంతమంది రైతులు ఇటీవల కాలంలో యంత్రాల ద్వారా వరి కోతలు గడ్డిని పొలాల్లోనే వదిలేస్తున్నారు. అనంతరం పంటల కోసం కాల్చివేస్తున్నారు. ఈ వరిగడ్డిలోంచి 40 నుంచి 50 శాతం మాత్రమే శక్తిగా మార్చి పశువు జీవక్రియలకు ఉపయోగపడుతుంది. వరిగడ్డి నిల్వ, వాటిలో లభించే ప్రొటీన్‌ల ఆవశ్యకతను మాగనూర్ పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ వివరించారు.

తయారీ విధానం..

పశుగ్రాసాలకు ఎంచుకున్న వరిగడ్డిలో పోషకాల స్థాయిని పెంచేందుకు యూరియా మంచి ఫలితాలిస్తుంది. ఈ విధంగా 100 కిలోల వరిగడ్డికి 4 కిలోల యూరియా నీటితో తడిపి ఇరవై రోజుల మాగాక వాడుకోవచ్చు.

- ముందుగా తయారికీ ఎంచుకున్న ప్రదేశాన్ని బాగా శుభ్రం చేసి పాలిథిన్ సంచులను కానీ పట్టాని కానీ పరువాలి. 60 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి, కర్రతో పూర్తిగా కరిగేలా కలపాలి. శుభ్రపరిచిన వరిగడ్డి 1/4 వంతు గడ్డిని పరిచిన పాలిథిన్ సంచిపై పరిచి, తయారు చేసిన యూరియా నీళ్లను పూర్తిగా తడిసేలా చల్లాలి. మరల ఒక పొర వరిగడ్డి పరిచి, మళ్లీ యూరియా నీళ్లు చల్లాలి.
- పొరల వారిగా వరిగడ్డి పరుస్తూ యూరియా నీరు పూర్తిగా గడ్డి తడిసేలా చల్లుతూ సమారు 20 రోజులు గాలి తగలకుండా, మాగబెట్టి తర్వాత జాగ్రత్తగా తెరిచి.. కొంచెం కొంచెం ఈ మాగుడు గడ్డిని, మామూలు పశుగ్రాసాలతో కలిపి పాడి పశువులను మేపడానికి అలవాటు చేయాలి.
- బూజుపట్టిన లేదా తెగులు సోకిన వరిగడ్డిని ఉపయోగించరాదు. మాగిన గడ్డికి 15 నిమిషాలు గాలి తగలనిచ్చిన తర్వాతే మేపాలి. యూరియా కలిపిన నీరు మిగిలితే దూడలు తాగకుండా పారబోయాలి.
- యూరియాతో మాగిన గడ్డిలో 6 శాతం మాంసకృతులు ఉండి, పశువు శరీర బరువు పెరుగుదల 2.2 శాతం పెంచగలిగి జీర్ణమయ్యే పరిమాణం 56 శాతం చూపుతుంది. మాగిన గడ్డి తియ్యగా, రుచికరంగా ఉంటుంది. కాబట్టి పశువులు ఇష్టంగా తింటాయి. ఎక్కువ భాగం జీర్ణం కాగలదు కాబట్టి పశువుల్లో జీవక్రియ సైతం సాఫీగా ఉంటుంది.

సూచనలు పాటించాలి..



రైతులు, పశుకాపరులు పైన సూచించబడిన సలహాలు, సూచనలు పాటించాలి. దీనివలన వారికి ఇబ్బందులు ఉండవు. పశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

– వినయ్‌కుమార్, మండల పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్

లీకేజీని బాగు చేశారు

సాక్షి ఎఫెక్ట్..



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు 46వ వార్డు పరిధిలోని గంజి నాగయ్యకాలనీ వీధి నం.1 వద్ద లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు మున్సిపల్ సిబ్బంది మరమ్మతు చేశారు. 'భగీరథ పైపులైన్ లీకేజీ' శీర్షికన ఈనెల 22వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి పైపులైన్ లీకేజీని గుర్తించారు. ఐదడుగుల పొడవునా సీసీరోడ్డును రెండు మీటర్ల లోతు తవ్వి దానిని సరిచేసి గుంతను పూడ్చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముళ్లపొదలో రహదారి



మరికల్: మండలంలోని తీలేర్, వెంకటాపూర్ మధ్యన ఉన్న రహదారి ముళ్లచెట్లతో కమ్ముకుపోయింది. ముళ్ల పొదల కారణంగా ఎదురుగా వచ్చే వాహనలు కన్పించకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఇరువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

బాదేపల్లి 'శబరిమలై'



అయ్యప్పస్వామి మూలవిరాట్



ఆలయ ప్రాంగణంలో ఉన్న హరిహరుడి విగ్రహం



ఆలయంలో ఏకశిలతో నిర్మించిన 18మెట్లు

- ఆకట్టుకుంటున్న అయ్యప్పస్వామి ఆలయం
- ఏకశిలతో పద్దెనిమిది మెట్లు
- లింగాకారంలో శివాలయం
- ఏటా నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో 60రోజుల అన్నదానం

జడ్చర్ల టౌన్: కార్తీకమాసం ఆరంభం కాగానే అయ్యప్పస్వాముల మాలాధారణ ప్రారంభం అవుతుంది. జనవరి సంక్రాంతి పర్వదినం వరకు స్వాములు దీక్షలో ఉండి పూజలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతారు. మాలాధారణ చేసుకున్న భక్తులు 45రోజుల పాటు నిత్యం పూజలు చేసుకుని శబరిమలై వెళ్లి దీక్షను విరమిస్తారు. అయితే శబరిమలై మాదిరిగానే బాదేపల్లి పట్టణంలోనూ అయ్యప్పస్వామి ఆలయం ఆకట్టుకుంటోంది. జడ్చర్ల-కల్వకుర్తి మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 2009లో అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించింది. దాంతో దాతల సాయంతో అయ్యప్పస్వామి సేవా సమితి భక్తబృందం ఆలయనిర్మాణ పనులు ప్రారంభించి 2013లో పూర్తిచేశారు. 2013 ఫిబ్రవరి మాసంలో పరిపూర్ణానంద స్వామిచే ఆలయాన్ని ప్రారంభింపజేశారు. నాటి నుంచి నేటి వరకు కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయంలో 60రోజుల పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. మాలధారణ చేసుకున్న వారికి అన్నదానం చేస్తుండటంతో వారికి వరంగా మారింది.

ఏకశిలతో నిర్మించిన మెట్లు

ఆలయం వద్ద ఏకశిలతో నిర్మించిన 18మెట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. శబరిమలైలో ఉన్నట్లుగానే ఏకశిలతో మెట్లు నిర్మించటంతో భక్తులు అదే భక్తిభావంతో మెట్లను పూజిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల హరిహరుడి విగ్రహం మరింతగా చూపరులను కట్టిపడేస్తోంది. రాత్రివేళల్లో విద్యుద్దీపాల వెలుగులో హరిహరుడి విగ్రహం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇక్కడ ఇటీవలే లింగాకారంలో శివాలయం నిర్మించారు. మొదటి అంతస్తులో మూల విరాట్‌తోపాటు వినాయకుడు, కుమారస్వామి, జంటనాగులు, మాలికాపురమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయ గ్రౌండ్‌ఫ్లోర్‌లో జ్ఞానసరస్వతి అమ్మవారి విగ్రహం, ఆంజనేయుడు, నవగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయంలోని ధ్వజస్తంభం సైతం శబరిమలైలో ఉన్నట్లుగానే ఏర్పాటు చేశారు. టేకుకర్రతో చేసిన ధ్వజస్తంభానికి లోహపు తొడుగు అలంకరించారు. ఆలయంలో ప్రతి బుధవారం పల్లకీసేవ నిర్వహిస్తారు. ఏటా డిసెంబర్ 27న ఆభరణాల ఊరేగింపు, మహాపడిపూజ చేస్తున్నారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



కోస్గిలో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ఊట్కూర్‌లో ..

కోస్గి: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం పట్టణంలోని ఎన్నికల సామాగ్రిని పోలీస్ బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. నియోజకవర్గంలో 275పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు కొడంగల్‌కు 343 బ్యాలెట్ యూనిట్లు, 343 కంట్రోల్ యూనిట్లు, 385 వీవీ ప్యాట్లు పంపిణీ చేశారు. ఎన్నికల విధుల కోసం పీఓ, ఏపీఓలు 316 మంది, ఓపీఓలు 632మంది, మైక్రో పరిశీలకులు 99మందిని నియమించారు. 8 మండలాల్లో మొత్తం 236625 మంది ఓటర్లు ఉండగా పోటీలో 13 మంది అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్దూరు: అసెంబ్లీ పోలింగ్ అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు జయరాం, అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని 44 పోలింగ్ స్టేషన్లకు గాను ఒక్కో స్టేషన్‌గాను 5మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్దూరు మండలంలో 37,139 ఓటర్లకు గాను 18,282 మంది మహిళలు, 18,856 మంది పురుషులు 1 ట్రాన్స్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లిలో 18 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 8,254 మంది మహిళలు, 8,039 మంది పురుషులు 1 ట్రాన్స్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కుండా భారీపోలీసు బందోస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ జనార్దన్ గౌడ్ తెలిపారు.

ఊట్కూరు: ఎన్నికల సందర్భంగా బుధవారం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలంలో మహిళా ఓటర్లు 22452 మంది, పురుషులు 21820 మంది ఓటుహక్కును వినియోగించనున్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బందిని ఏర్పాటుచేసి 7రూట్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గోకరి తెలిపారు.

మరికల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధులు కేటాయించిన సిబ్బంది బుధవారం మండలానికి చేరుకున్నారు.వారికి కేటాయించిన ప్రత్యేక బస్సుల్లో కేంద్ర పోలీస్ బలగాలతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అనంతరం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

మాగనూర్: మండలంలోని ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ శశికళ తెలిపారు. మొత్తం 25పోలింగ్ కేంద్రాలలో 30న నిర్వహించబోవు ఎన్నికలకు ఏర్పాట్లుపూర్తి చేసినట్లు తెలిపారు.

ధన్వాడ: మండలంలోని బుధవారం అన్ని బూత్‌లకు ఎన్నికల అధికారులు పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. నేడు నిర్వహించే పోలింగ్ కోసం బ్యాలెట్ ఈవీఎంలను పరిశీలించి సిద్ధంగా ఉంచారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండొద్దని ఎస్ఐ రమేష్ తెలిపారు.

దామరగిద్ద: మండలంలోని 30పంచాయతీ పరిధిలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ నాగజ్యోతి తెలిపారు. మండలంలోని మొత్తం 53పోలింగ్ బూత్‌లలో 43742 ఓటర్లు ఉన్నారు. వీరిలో 21604 మంది పురుషులు, 22139మంది మహిళలు ఓటుహక్కును వినియోగించనున్నట్లు ఆమె తెలిపారు



ధన్వాడలో పోలింగ్ వివరాలను సరిచూసుకుంటున్న సిబ్బంది



మద్దూర్ కొత్తపల్లి మండలంలో..



మరికల్‌లో పోలీస్ బలగాలతో చేరుకున్న సిబ్బంది

ముష్టిపల్లిలో గడ్డివాము దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోతున్న గడ్డివాము

పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన నన్నయ్య పొలంలో గడ్డివాము ఏర్పాటు చేశారు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. గమనించిన చుట్టుపక్కల రైతులు బాధిత రైతుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఘటన స్థలానికి చేరుకునేలోపే అగ్నికి ఆహుతి అయ్యింది. సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

బస్టాండ్లను మరమ్మతులు చేయాలి

మరికల్: మండలంలోని పలు గ్రామాల స్టేజీల వద్ద ఉన్న గ్రామీణ బస్టాండ్లను సంబంధిత అధికారులు మరమ్మతులు చేసేందుకు ముందుకు రావాలని కార్మిక సంఘం నాయకులు రాములు, వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. గ్రామాల స్టేజీల వద్ద బస్టాండ్లను పట్టించుకోకపోవడంతో ముళ్లపొదాలు అలుముకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

ముళ్లపొదల్లో కేఎస్పీ కాల్వలు

మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించే కాల్వలు ముళ్లపొదల్లో అల్లుకుపోయాయి. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేస్తే నీరు ముందుకు రాని విధంగా ముళ్లచెట్లు ఉన్నాయి. తీలేర్ పంపుహౌస్ నుంచి వచ్చిన డిస్ట్రిబూటర్ 16 కాల్వతోపాటు పిల్ల కాల్వల పరిస్థితి కూడా ముళ్లపొదలతో మూసుకుపోయాయి. పంపుహౌస్ నుంచి కన్మనూర్ వరకు 20కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ కాల్వలో ముళ్లచెట్లతోపాటు పిచ్చిమొక్కలు భారీగా పెరగడంతో వానాకాలంలో నీళ్ల రాని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ముళ్లచెట్లతో మూసుకపోయిన కాల్వ

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- అరకొర వసతులతో కొనసాగుతున్న కేంద్రాలు
- సొంత భవనాలు లేక ఇబ్బందులు



పెద్దకడ్మూర్‌లో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం (ఫైల్)

నర్వ: స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు, కిశోర బాలికలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించి ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్య అందిం చేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిష్టాత్మకమైన ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా సేవలందించే కేంద్రాలు మాత్రం సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.

ఉమ్మడి మండలంలో మొత్తం 33 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో కేంద్రాల పర్యవేక్షణకు సూపర్‌వైజర్‌లు 32 మంది కార్యకర్తలు, 33 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఇందులో మొత్తం 7నెలల నుండి 3సంవత్సరాల పిల్లలు 476 మంది, 1సం .నుండి3సం. పిల్లలు978 మంది, 2సం. నుంచి 6సం. పిల్లలు 1580 మంది ఆటపాటల ద్వారా విద్యనభ్యసిస్తున్నారు. 508మంది గర్భిణులు, 591మంది బాలింతలు నమోదు కాబడితే వీరికి ఒక్కపూట సంపూర్ణ ఆహారం అందించేందుకు ఆరోగ్యలక్ష్మీ నిత్యం అమలు చేస్తుంటారు. అలాగే 2056 మంది కిశోర్ బాలికలకు ప్రతి నెలకు పౌష్టికాహారం సరఫర చేస్తుంటారు. ఈ నేపథ్యంలో సేవలందించే కేంద్రాలకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి.

అద్దెభవనాల్లో అరకొర వసతులు..

నిత్యం సేవలందించే ఈ కేంద్రాలు పెద్ద గ్రామాల్లో 2లేదా3 సెంటర్లు, చిన్న గ్రామాల్లో ఒక్కో సెంటర్లు ఉంటాయి. కాని ఈ కేంద్రాలకు ప్రభుత్వం సొంత భవనాలు మంజూరు చేయక కొంత, మంజూరైన వాటిలో నిర్మాణాలు పూర్తికాక అసంపూర్తిగా మిగిలినవి కొంత, ఉండడంతో నిర్వాహణకోసం భవనాలను అద్దెకు తీసుకొని అందులో సెంటర్‌లను నడుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో అద్దెభవనాలు దొరకక ప్రభుత్వ భవనాల్లో, లేదా పంచాయతీ కార్యాలయాల్లో, లేదా కమ్యూనిటీ భవనాల్లో సెంటర్‌లను నడుపుతున్నారు.

మండలంలో పరిస్థితి..

మండలంలో పెద్దకడ్మూర్, కుమార్‌లింగంపల్లి, కల్వాల్, రాయికోడ్ గ్రామాల్లో సొంత భవనాలు ఉన్నాయి. మిగతా గ్రామాల్లో 17అద్దె భవనాలు, అద్దెలేని భవనాలు (పాఠశాలలు, మహిళాసమాఖ్య భవనాలు, పంచాయతీ కార్యాలయాలు 14కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి.

సొంత భవనాలు లేక ఇబ్బందులు..

మండలంలో కొన్ని గ్రామాల్లోనే సొంత భవనాలున్నాయి. అద్దెభవనాలు 17 ఉండగా ప్రభుత్వ భవనాలు అద్దె లేనివి 14ఉన్నాయి. వీటిలోనే పిల్లలకు అన్నికార్యక్రమాలు చేపడుతున్నాం. ఇటీవల యాంకిలో పాఠశాలలో ఏర్పాటుచేసిన రెండు సెంటర్‌లలో ఒక్కటిని మార్చాం. గ్రా మాల్లో సొంతభవనాల ఏర్పాటుకు ప్రతి పాదనలపై అధికారులకు పంపించాం.

పి.అరుణ, సూపర్‌వైజర్ నర్వ